www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 27 జనవరి 2024



పుల్లలపాడులో పులి కలకలం

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం పుల్లల పాడు గ్రామ సమీపాన ఉన్న అడవిలో రెండు రోజులుగా పులి సంచారం కలకలం రేపుతోంది. గ్రామంలో కొందరు వ్యక్తులు ఈ ప్రాంతంలో సంచరిస్తున్న పులిని చూసామంటూ చెప్పడంతో ప్రజల భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు చెబుతున్న జాగాలో పులి అడుగుజాడలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. దీనిపై స్పందించిన డిఆర్‌ఓ వేణుగోపాల్ రాజమండ్రి రేంజ్ అటవీశాఖ అధికారులతో కలిసి పుల్లలపాడు అటవీ ప్రాంతంలో శుక్రవారం పాదము ద్రలను సేకరించారు. పులి అడుగుజాడలుగా చెబుతున్న చోట ప్రత్యేక రసాయనాలు జల్లి పాదముద్రలను సేకరించారు. అటవీ ప్రాంతంలో విస్తృతంగా తిరిగి పులి సంచార వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా గణతంత్రం

జిల్లాలో గణతంత్ర దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా స్థాయిలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరించారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు జరిగాయి.

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో ముందుకు నడిపించడంలో మనందరం సమన్వయంతో పనిచేస్తూ అడుగులు వేద్దామని కలెక్టర్ కె.మాధవీలత పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఆవరణలో 75వ గణతంత్ర వేడుకల్లో ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు. గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రగతిని ఆమె వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలరెడ్డి, ఎంపీ మార్గాని భరత్‌రామ్, రూడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా, ఎస్‌పి పి.జగదీష్, జెసి ఎన్.తేజ్ భరత్, మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, సబ్ కలెక్టర్ అసుతోష్ శ్రీవాత్సవ్, పోలవరం సహాయ కలెక్టరు ప్రవీణ్ ఆదిత్య, తదితరులు పాల్గొన్నారు. తపాలా శాఖ రాజమండ్రి తపాలా డివిజన్ సూపరింటెండెంట్ కార్యాలయంలో సూపరింటెండెంట్ పి.కోమల్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి గంధం సునీత జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి బెంచి జడ్జి నాగేశ్వరరావు, 7వ అదనపు జిల్లా జడ్జి బెన్నయ్‌నాయుడు, ఎసిబి కోర్టు జడ్జి వివి.ప్రసాద్, జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూషకుమారి, పలువురు జడ్జిలు, రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు, జియువిబి.రాజు, సీనియర్ న్యాయవాదులు ఎం.సుబ్బారావు, సిహెచ్‌వి.ప్రసాద్, జిల్లా కోర్టు ప్రధాన పరిపాలన అధికారి ఎస్‌ఎస్.ప్రసన్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

రాజహేంద్రవరరం రూరల్ ఆల్కట్ గార్డెన్స్ వద్దనున్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ అభివృద్ధి సంస్థలో డిజిఎం.కృష్ణయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. **దేవరపల్లి** మండలంలో తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం.రామకృష్ణ, జెండాను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల భవనం వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి బండి సూర్య ప్రకాశరావు జెండాను ఆవిష్కరించారు. **ఉండ్రాజవరం** మండల పరిషత్ కార్యాలయం తో పాటు, పలు గ్రామాల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రొటోకాల్ ప్రకారం ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులే జెండా ఆవిష్కరణ చేయాల్సి ఉన్నప్పటికీ, పలుచోట్ల నాయకులతో ఆవిష్కరణలు జరిపించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. **తాళ్లపూడి** మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలు, కార్యాలయాల్లో గణతంత్ర వేడుకలు జరిగాయి. గజ్జరం సచివాలయం వద్ద సర్పంచ్ డాక్టర్ గండి రాంబాబు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ వద్ద వ్యవస్థాపక కరస్పాండెంట్ వి.వి.అనీష్, ఆయా గ్రామాల సచివాలయాల వద్ద సర్పంచులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. **చాగల్లు** మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. చాగల్లు జడ్‌పి ఉన్నత పాఠశాలలో ముఖ్య అతిథులుగా ఎంఎల్‌ఎ తలారి వెంకట్రావు పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. వివిధ పోటీల్లో విద్యార్థులకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వీర్రాజు, ఎంపిపి మట్టా వెంకట్రావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **గోకవరం** మండలం రంపఎర్రంపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాలలో పిఎంసి చైర్మన్ పి.గుప్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రమీల రాణి, ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **దేవరపల్లి** యర్నగూడెం సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో జాతీయ జెండాను మంత్రి వనిత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తాను చదివిన పాఠశాలలో జరిగిన గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం చాలా ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **గోపాలపురం** ఎంపిడిఒ, తహశీల్దార్ తదితర ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి జెండాను ఆవిష్కరించారు. తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ బి.రవీంద్రనాథ్ జెండాను ఆవిష్కరించారు. కొండవీటి విద్యాసంస్థలలో కరస్పాండెంట్ కెఎస్‌డి.ఆశీర్వాదం ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు జరిపారు. ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, సూపరింటెండెంట్ రాజ్‌మనోహర్, ఇఒపిఆర్‌డి శ్రీనివాస్, అనిల్, డిటి.కృష్ణ పాల్గొన్నారు. **సీతానగరం** పువ్వాడ సత్యమాంభ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వీరభద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంపిపి గుర్రాల జ్యోత్స్న ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రమేష్ జెండాను ఆవిష్కరించారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్‌ఐ రామకృష్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. సూర్యచంద్ర హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ కనికి రెడ్డి, కరస్పాండెంట్ లక్ష్మీ ప్రసన్న, హెచ్‌ఎం ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు. **పెరవలి** మండలంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద తహశీల్దార్ టి.రాజేశ్వరి, ఎంపిడిఒ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపిపి కె.సీతారాంప్రసాద్, పోలీస్ స్టేషన్ వద్ద టి.ప్రసాదరావు జెండాను ఆవిష్కరించారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత



జిల్లా కోర్టులో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి సునీత



దేవరపల్లిలో నిర్వహించిన వేడుకల్లో మాట్లాడుతున్న మంత్రి వనిత



గోపాలపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద గణతంత్ర వేడుకలు



గోకవరం మండలం ఎర్రంపాలెం జడ్‌పి పాఠశాలలో వేడుకలు



రాజమహేంద్రవరం రూరల్ యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థలో...

బిజెపి ప్రజావ్యతిరేక విధానాలపై నిరసన

ప్రజాశక్తి - చాగల్లు

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా, ట్రేడ్ యూనియన్ల ఐక్య వేదిక పిలుపు మేరకు శుక్రవారం చాగల్లు మండలంలో ఎపి రైతు సంఘం, ఎపి కౌలు రైతు సంఘం, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం, సిఐటియు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ, అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచకుండా మోసగిస్తుందన్నారు. వ్యవసాయ, పారిశ్రామిక, రవాణా, ఖనిజ, సకల సంపదలను అంబానీ, అదానీ తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందన్నారు. అందుకు అడ్డుగా ఉన్న చట్టాలను అడ్డగోలుగా మారుస్తుందన్నారు. ప్రశ్నించిన వారిపై కేసులు, వేధింపులు సాగిస్తు ప్రజాతంత్ర హక్కులను, రాష్ట్రాల హక్కులను కాలరాస్తు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తుందన్నారు. మోడీ పాలనలో అదానీ, అంబానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగా, పేద రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. ఈ పదేళ్లలో 1.50లక్షల మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారన్నారు. బిజెపి రెండోసారి అధికారంలోకొచ్చిన తర్వాత 26 శాతం ఆత్మహత్యలు పెరిగాయన్నారు. స్వామినాథన్ కమిటి సిఫార్సుల అమలు చేయాలని, మద్దతు ధరల చట్టం చేయాలని, కేరళ తరహా విధానాన్ని అమలు చేయాలని, రైతుల రుణాలు మాఫీ, రుణ ఉపశమన చట్టం చేయాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి, ఉపాధికి రూ.2లక్షల కోట్లను బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. 200 రోజులు పని కల్పించాలని, వేతం రోజుకు రూ.600 పెంచాలన్నారు. రెండు పూటల పని విధానం, ఆన్‌లైన్ మస్టర్లను రద్దు చేయాలన్నారు. ఆహార భద్రత చట్టాన్ని పటిష్ట పరచాలన్నారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని, కడప ఉక్కును నిర్మించాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలి, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలుపుదల చేయాలన్నారు. భూహక్కుల చట్టం 22ను ఉపసంహరించాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, నిర్వాసితులకు పూర్తి పునరావాసం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరువు, తుపాను నష్టపరిహారాలు, ఇన్‌పుట్ సబ్సిడీలను వెంటనే విడుదల చేయాలన్నారు. సాగులో ఉన్న కౌలు రైతులకే నష్ట పరిహారాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ హక్కుల చట్టం సవరణలు ఉపసంహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.మాణిక్యాంబ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె.ఆదాం, కెకె.దుర్గారావు, కౌలు రైతు సంఘం నాయకులు కంకటాల బుద్ధుడు, రామనాథం, మురళి, ఎపి రైతు సంఘం నాయకులు సుభాష్ చంద్రబోస్, జుజ్జవరపు శ్రీను, సుశీల, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బైకు ర్యాలీలో పాల్గొన్న రైతు, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు



బిక్కవోలుతో బాధిత కుటుంబానికి సాయం అందిస్తున్న భువనేశ్వరి

ముగిసిన భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేర మూడు రోజుల పాటు నిర్వహించిన పర్యటన శుక్రవారంతో ముగిసింది. మొదటిరోజు జగ్గంపేట, పెద్దాపురం, తుని, కాకినాడ సిటీ నియోజకవర్గాల్లో పర్యటించారు. నలుగురు కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. రెండో రోజు పి.గన్నవరం, అమలాపురం, రాజోలు, మండపేట నియోజకవర్గాల్లో పర్యటించి ఏడుగురు కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. చివరి రోజైన శుక్రవారం అనపర్తి, నిడదవోలు, కొవ్వూరు, రాజానగరం నియోజకవర్గాల్లో పర్యటించి ఐదురుగు కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. మూడు రోజుల్లో 16మంది కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. శుక్రవారం మధురపూడి ఎయిర్ పోర్టు నుంచి హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు. భువనేశ్వరికి విమానాశ్రయం వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు వీడ్కోలు పలికారు.


రాజానగరం జనసేనాని ఎవరు?

అధినేత పవన్ ప్రకటనతో పొలిటికల్ హీట్
టిడిపి నేత బొడ్డు వెంకటరమణచౌదరి ఆశలపై నీళ్లు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజానగరంలో జనసేనాని ఎవరు..? రాజానగరం, రాజోలు నియోజక వర్గాల్లో జనసేన పోటీచేస్తుందని శుక్రవారం జనసేన అధినేత పవన్ కళ్యాన్ ప్రకటించడంతో రాజగనరంలో పొలిటికల్ హీట్ ఒక్కసారిగా తారాస్థాయికి చేరింది. అధినేత ప్రకటనతో నియోజక వర్గ ఇన్‌ఛార్జి బత్తుల బలరామకీష్ణ శిబిరంలో ఉత్సాహం నెలకొంది. జనసేన కార్యాలయానికి కార్యకర్తలు, అభిమానుల పెద్ద ఎత్తున తరలి వచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. బత్తుల బలరామకృష్ణ సైతం తమ పార్టీ అధినేతకు పత్రికా ముఖంగా ధన్యవాదాలు తెలిపారు. కొన్ని నెలలుగా బత్తుల, అధికారపార్టీ ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజాకు పోటీగా నియోజక వర్గ ప్రజలతో మమేకం అవుతున్నారు. జనసేన పోటీ చేస్తుందని చెప్పారు తప్ప అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో రాజానగరంలో జనసేన తరుపున పోటీలో నిలిచేదెవరు అనే ఉత్కంఠ నెలకొంది. మరోపక్క ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్ బరిలో నిలబడతారనే ప్రచారం ఊపందుకుంది. టిడిపి, జనసేన పొత్తు నేపథ్యంలో రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గంలో కొన్ని రోజులుగా పలు మార్లు చర్చలు జరిపినా ఫలితం లేకపోయింది. టిడిపి సీనియర్ నేత, ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి వరుసగా ఇక్కడ రెండు సార్లు ఎంఎల్‌ఏగా గెలుపొందారు. ఈ నియోజక వర్గం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కోరినట్లు సమాచారం. టిడిపికి బలమైన కేంద్రం కావడంతో ఇక్కడ సీటుపై చిక్కుముడి వీడటంలేదు. జనసేన జిల్లా అధ్యక్షులు కందుల దుర్గేష్, బుచ్చయ్య చౌదరి ఎవరికి వారు తామే పోటీ చేస్తామనే ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల దుర్గేష్ సతీమణి ఉషారాణి మృతి చెందిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో ఆ పార్టీ ముఖ్యనేతలు నాగేంద్రబాబు, నాదెండ్ల మనోహర్ ఇరువురూ కందుల దుర్గేష్‌ను 25న జిల్లాకు వచ్చి పరామర్శించారు. దుర్గేష్‌తో ప్రత్యేకంగా భేటీ కూడా అయ్యారు. ఈ పరిణామం జరిగిన మరుసటి రోజునే జనసేనాని పవన్‌కళ్యాణ్ రాజానగరం, రాజోలు రెండు నియోజక వర్గాల్లో జనసేన పోటీ చేస్తుందని స్పష్టం చేశారు. తేదేపా-జనసేన పొత్తు నేపథ్యంలో రాజమండ్రి రూరల్ నియోజక వర్గం టిడిపికి కేటాయిస్తే రాజానగరం నుంచి జనసేన అభ్యర్థిగా కందుల దుర్గేష్ పోటీచేసే అవకాశాలూ లేకపోలేదు. తాజా నిర్ణయంతో రూరల్ ఎంఎల్‌ఎ బుచ్చయ్య చౌదరికీ లైన్ క్లియర్ అయినట్లు తెలుస్తోంది. అయితే టిడిపి శిబిరం నిరాశ వ్యక్తమవుతోంది. 2004, 2009 ఎన్నికల్లో రాజానగరం నియోజక వర్గం నుంచి టిడిపి అభ్యర్థి పెందుర్తి వెంకటేష్ వరుసగా రెండు సార్లు గెలుపొందారు. 2019 ఎన్నికల్లో 21 వేల ఓట్లతో ఓటమి పాలయ్యారు. ఈ నియోజక వర్గంలో సీతానగరం, కోరుకొండ మండలాల్లో టిడిపికి బలమైన పునాది ఉందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. దీంతో తేదేపా నేత బొడ్డు వెంకట రమణ చౌదరి రాజానగరం నుంచి పోటీ చేసేందుకు సమాయత్తం అయ్యారు. వెంకట రమణ చౌదరి గతంలో పెద్దాపురం లేదా అనపర్తి నియోజక వర్గం నుంచి పోటీచేస్తానని కోరగా రాజానగరం బరిలో నిలబడాలని స్వయంగా టిడిపి అధినేత నారా చంద్రబాబు సూచించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇటీవల పార్టీ ప్రచారానికి కూడా సమాయత్తం అయ్యారు. కోరుకొండ లక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచార రథాన్ని తయారు చేసుకున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రకటనతో టిడిపి శిబిరంలో నిరాశ వ్యక్తమవుతోంది.

కార్టూ'నిజం'




సేవలకు సత్కారం

ప్రజాశక్తి - యంత్రాంగం

గణతంత్ర వేడుకల్లో భాగంగా వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులకు పురస్కారాలను కలెక్టర్ అందించారు.

గోపాలపురంలో ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ ఉత్తమ పోలీస్ అవార్డును ఎస్‌పి పి.జగదీష్ ఆధ్వర్యంలో కలెక్టర్ నుంచి స్వీకరించారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. **చాగల్లు** తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మికి ఉత్తమ సేవా పురస్కారాన్ని కలెక్టర్ కె.మాధవీలత చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఎంపిపి మట్ట వీరస్వామి, సర్పంచ్ ఉన్నామట్ల మనశ్శాంతి తదితరులు అభినందనలు తెలిపారు. **బిక్కవోలు** ఎంపిడిఒ జెఎ.ఝాన్సీ ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. జడ్‌పిటిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందనలు తెలిపారు. **గోకవరం** ఎపిఒ పిఎస్.అప్పలరాజు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఎంపిపి సుంకర శ్రీవల్లి, జడ్‌పిటిసి సభ్యులు దాసరి శ్రీరంగ, వైసిపి మండల కన్వీనర్ పాటి రాంబాబు, ఎంపిడిఒ కె.పద్మజ్యోతి, తహశీల్దార్ శ్రీనివాస్ తదితరులు అభినందనలు తెలిపారు. **సీతానగరం** పిహెచ్‌సి పరిధిలో నాగంపల్లి సబ్ సెంటర్ ఎఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న బండి మంగకు ఉత్తమ సేవా పురస్కారం అందించారు. పురుషోత్తపట్నంలో సచివాలయంలో ఎఎన్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న పద్మ బెస్ట్ వర్కర్‌గా ఎంపికయ్యారు. మదర్ థెరిసా సేవాసమితి సంస్థ ద్వారా సేవలందిస్తున్న పెదపాటి రమేష్‌బాబు కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు. **దేవరపల్లి** ఎస్‌ఐ కె.శ్రీహరిరావు ఉత్తమ సేవా పురస్కారాన్ని కలెక్టర్ నుంచి అందుకున్నారు. ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. **తాళ్లపూడి** మండలం ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి కె.వీరన్న, ఐకెపి ఎపిఎం రోజ్ మాణిక్యం, వ్యవసాయ శాఖ అధికారి రుచిత, మలకపల్లి సబ్ స్టేషన్ జెఎల్‌ఎం యుగంధర్ ఉత్తమ సేవా అవార్డులు అందుకున్నారు. **రాజమహేంద్రవరం రూరల్** ధవళేశ్వరంలో ఎస్‌ఇ బెల్లపు శ్రీనుబాబు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. **కడియం** మండలంలో జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, మండల పరిషత్ పరిపాలనాధికారి కె.చంద్రరావు, ప్రభుత్వాసుపత్రి వైద్యులు డాక్టర్ ఎల్. మోహనవంశీ, హెడ్ నర్స్ బాపనమ్మ, మత్స్యశాఖ సహాయకురాలు లక్ష్మీ, కానిస్టేబుల్ పి.భీమారావు, కడియపులకం సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ జి.సుబ్రహ్మణ్యం ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారు. **రాజానగరం** మండలంలో ఎపిఇపిడిసిఎల్ ఎఇ వైవిఎస్.సుబ్రహ్మణ్యం ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవరంలోని ఎపిఇపిడిసిఎల్ సర్కిల్ ఆఫీస్‌లో ఎస్‌ఇ టివిఎస్ఎన్.మూర్తి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.



కలెక్టర్ మాధవీలత నుంచి అవార్డును అందుకుంటున్న జిల్లా మత్స్యశాఖ అధికారి కృష్ణారావు



చాగల్లు తహశీల్దార్ రాజ్యలక్ష్మి, బిక్కవోలు ఎంపిడిఒ ఝాన్సీ, గోపాలపురం ఎస్‌ఐ సతీష్‌కుమార్, దేవరపల్లి ఎస్‌ఐ శ్రీహరిరావు, ఎఎన్‌ఎం మంగ, తాళ్లపూడి ఇఒపిఆర్‌డి వీరన్న, ఎస్‌ఇ శ్రీనుబాబు, ఎఇ సుబ్రహ్మణ్యం

నేరాలు ఘోరాలు

రూ.1.27 లక్షలు కాజేసిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్

ఇబ్బందిలో ఉన్న ఒక మహిళకు న్యాయం చేయిస్తానని నమ్మబలికి ఆమె నుంచి రూ.1.27 లక్షలు సొమ్ము కాజేసిన కేసులో సామర్లకోటకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ సురేష్ తెలిపారు. పట్టణానికి చెందిన కమ్మిల శ్రీనివాసు పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఒక మహిళతో అధికారుల వద్ద తనకు చాలా పలుకుబడి ఉందని, ఆ సమస్యను పరిష్కారం చేస్తానని నమ్మించాడు. తొలుత మహిళ వద్దనుంచి కొంత సొమ్మును తీసుకోగా ఆమె నిలదీయగా అతడు ఆమెను మరలా భయపెట్టి మరికొంత సొమ్ము కాజేసాడన్నారు. ఆ మహిళ వద్ద నుండి మొత్తం రూ.1,27,000 నిందితుడు కాజేసినట్లు భాదితురాలు చేసిన ఫిర్యాదుపై సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి శ్రీనివాస్‌ను కాకినాడ న్యాయస్థానం ముందు హాజరు పరిచామన్నారు. అతనికి కోర్టు రిమాండు విధించినట్లు సిఐ సురేష్ వివరించారు.

సారా తయారీ కేంద్రంపై దాడులు

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

పట్టణంలో సారా తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు జరిపినట్టు ఎస్ఇబి సిఐ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. రైల్వే స్టేషన్ సమీపంలో పిఠాపురం మండలం జల్లూరుకు చెందిన గంజా గంగాధర్ అరెస్ట్ చేసి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. సారా తయారీకి సిద్ధం చేసిన 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు చెప్పారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి -దేవరపల్లి

రిపబ్లిక్ డే సందర్భంగా. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అమలు చేయాలని ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలని భారత బచావో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు దేవరపల్లి మండలం దుద్దుకూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పీఠికను చదివారు. అనంతరం అంబేద్కర్ కు నివాళులర్పించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద వైఖరి నశించాలని కార్పొరేటీకరణ పాసిజం నశించాలని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని, భారత బచావో గోదావరి జిల్లాల కార్యదర్శి ఎస్కే మస్తాన్ అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మతం పేరుతో రాజకీయాలు చేస్తూ దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేస్తూ ఆర్ఎస్ఎస్ భావజాలంతో కాషాయీకరణ పేరుతో మారణ హోమం సృష్టిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపికి మద్దతునిచ్చే రాజకీయ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పావడ సురేష్, ఏడుకొండలు, బొంత సీతయ్య, సత్యనారాయణ, సీతయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు

ట్రస్ట్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఎంవిఎస్.రాజు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ముదునూరి సత్యనారాయణరాజు పుట్టినరోజు సందర్భంగా వెలగదుర్రులో శుక్రవారం వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఎంవిఎస్.రాజు అమెరికాలో వైద్యునిగా స్థిరపడ్డారు. ఆయన స్థాపించిన ఎంవిఎస్ రాజు ట్రస్టు ద్వారా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని 400 మందికి దుప్పట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ కన్వీనర్ ముదునూరి నారాయణరాజు, సెక్రటరీ పెన్మత్స శ్రీనివాసరాజు, సతీష్ రాజు, రవీంద్రరాజు, మురళీకృష్ణంరాజు, సుబ్బరాజు, తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు అభినందనలు

ప్రజాశక్తి - పెరవలి

మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కోనా వెంకటవేణు, పెరవలి పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ జి.సాంబయ్యలకు ఉత్తమ సేవా అవార్డులు రావడంతో అవార్డు గ్రహీతలకు ఎంపిపి కార్చెర్ల సీతారాం ప్రసాద్, జడ్‌పిటిసి సభ్యులు కొమ్మిశెట్టి రామాంజని, ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్, తహశీల్దార్ టి.రాజేశ్వరి, ఎస్ఐ ఎం.సూర్య భగవాన్, వైసిపి మండల అధ్యక్షులు వీరమల్ల సత్యనారాయణ, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు సిబ్బంది అభినందించారు.

ఎంఎల్ఎ అభ్యర్థులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పెరవలి

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యంఠాగూర్, రాష్ట్ర పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిళ ఆదేశాల మేరకు శాసన సభ అభ్యర్థులుగా పోటీ చేయాలనుకునే వారు దరఖాస్తు చేసుకోవచ్చని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు అరిగెల అరుణకుమారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొవ్వూరు, గోపాలపురం స్థానాలకు దరఖాస్తు చేసుకునేవారు రూ.5వేల ధరావత్తు, రాజమహేంద్రవరం రూరల్, అనపర్తి, రాజానగరం, నిడదవోలు స్థానాలకు పోటీ చేయాలనుకునేవారు రూ.10వేల దరావత్తు 'ప్రెసిడెంట్ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ' పేరున చెల్లించి ఆంధ్రరత్న భవన్, విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, విజయవాడకు అందించాలన్నారు. జనవరి 30వ వరకూ దరఖాస్తు చేసుకునే వరకూ గడువు ఉందన్నారు.

'ప్రేమలో' చిత్రాన్ని ఆదరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

చందు కోడూరి హీరోగా, దర్శకునిగా తెరకెక్కించిన 'ప్రేమలో' చిత్రాన్ని ఆదరించాలని నిర్మాత రాజేష్ కోడూరి, ఆయన మిత్ర బృందం కోరారు. శుక్రవారం నగరంలోని శివజ్యోతి థియేటర్‌లో ప్రేక్షకులతో కలసి నిర్మాత రాజేష్ కోడూరి ఈ చిత్రాన్ని వీక్షించారు. ఈ చిత్రంలో చరిష్మా శ్రీఖర్ హీరోయిన్‌గా నటించారు. డ్రీమ్ జోన్ పిక్చర్స్ బ్యానర్‌లో రాజేష్ కోడూరి నిర్మించారు. సినిమా రిపబ్లిక్ డే కానుకగా శుక్రవారం థియేటర్స్‌లో విడుదలైంది. ప్రేమలో చిత్రం ఆద్యంతం ఆసక్తిగా సాగడంతో ప్రేక్షకుల్లో మంచి రెస్పాన్స్ వచ్చిందన్నారు. ఈ చిత్రంలో భారీ ఎమోషన్స్ కూడా ఉన్నాయని,కథలో బలం, కాన్సెప్ట్‌లో దమ్ముందని ప్రేక్షకులే వెల్లడిస్తున్నారని ఆయన అన్నారు. సినిమా చిత్రీకరణ గోదావరి తీరం, రాజమండ్రి పరసర ప్రాంతాల్లోనే జరిగిందన్నారు. చిన్న చిత్రాలను ప్రేక్షకులు ఆదరించడం వల్ల మరింత మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు.

మంట పుట్టించిన మండపేట.!

సిట్టింగ్ ఎంఎల్ఎకు సీటు ప్రకటించిన చంద్రబాబు
రాజోలు, రాజానగరంలో పోటీ చేస్తున్నట్టు పవన్‌క్లారిటీ
పొత్తు ధర్మంపై రాజకీయ వర్గాల్లో చర్చ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

'నాకున్న ఒత్తిళ్లు నాకున్నాయి. వాళ్లు రెండు సీట్లు ప్రకటించారు కాబట్టి మేం రెండు సీట్లు ప్రకటిస్తున్నాం. రాజోలు, రాజానగరంలో జనసేన పోటీ చేస్తోంది' అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ శుక్రవారం రిపబ్లిక్ డే వేడుకల సందర్భంగా ప్రకటించారు. దీనికి కారణం ఇటీవల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలోని మండపేటలో 'రా కదలి రా' సభలో సిట్టింగ్ ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావును మూడోసారి గెలించాలి అంటూ చంద్రబాబు ప్రకటించారు. దీంతో పాటు అరకు సీటుని కూడా డిక్లేర్ చేశారు. దీంతో మిత్ర పక్షాల మధ్య మండపేట మంట పుట్టించినట్లు అయింది. గత ఎన్నికల్లో జనసేన తరుపున ఇక్కడ వేగుళ్ల లీలా కృష్ణ పోటీ చేయగా ఎక్కువ ఓట్లనే సాధించారు. ఈసారి కూడా ఆయనే టికెట్ ఆశిస్తున్నారు. ఈలోగా టిడిపి సిట్టింగ్ సీటు కాబట్టి చంద్రబాబు బహిరంగ సభలో ప్రకటించారు. దీంతో జనసేన శ్రేణులు తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో తాజాగా పవన్ కళ్యాణ్ తన పార్టీ శ్రేణులకు క్షమాపణ కూడా చెప్పారు. దీంతో పాటుగా ఉమ్మడి జిల్లాలో రెండు సీట్లు ప్రకటించడంతో రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గత ఎన్నికల్లో జనసేన గెలుపొందిన ఏకైక సీటు రాజోలు మాత్రమే. ఇక్కడ జనసేన సిట్టింగ్ సీటును ప్రకటించడంలో పెద్దగా ఆశ్చర్యం లేదు కానీ రాజానగరంలో మాత్రం ఆసక్తిగా మారింది. అక్కడ గడచిన మూడు ఎన్నికల్లో రెండుసార్లు టిడిపి గెలిచింది. 2019లో మాత్రం ఓడిపోయింది. ఆ సీటును బొడ్డు వెంకటరమణ చౌదరి ఆశిస్తున్నారు. దానికి తగ్గట్టుగానే గత ఏడాదికాలంగా క్షేత్రస్థాయిలో గట్టిగా పని చేస్తున్నారు. ఇప్పుడు ఆ సీటులో బొడ్డును కాదని జనసేన పోటీ చేస్తుందని ప్రకటించడంతో టిడిపి శ్రేణులు ఆగ్రహంతో ఉన్నారు. అధినేతలు మాట్లాడుకొని ఉమ్మడిగా ముందుకు వెళ్లాల్సింది పోయి ఇలా బహిరంగంగా సీట్లను ప్రకటించడం వల్ల కింది స్థాయిలో ఇరు పార్టీల్లో సందిగ్ధత ఏర్పడింది. ఇది పొత్తుపై ప్రభావం పడేలా కనిపిస్తుంది. టిడిపి, జనసేన పొత్తుతో ముందుకు వెళితే



ముఖ్యంగా గోదావరి జిల్లాలు అందులో తూర్పు గోదావరి జిల్లాలో ఎక్కువగా ఈ ప్రభావం ఉంటుందని తొలి నుంచీ అంచనాలు ఉన్నాయి. దానికి తగ్గట్లుగానే ఇప్పుడు మండపేట మంట పుట్టించడం దానికి కొనసాగింపుగా రాజోలు, రాజానగరం ఈ మంట రాజేయడంతో వీళ్ళ పొత్తులో ఇంకా ఎన్ని మలుపులు ఉంటాయో అనే ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా రెండు పార్టీల నాయకుల్లో సందిగ్ధత మరింత పెరిగింది. క్షేత్రస్థాయిలో శ్రేణుల్ని మరింత గందరగోళంలోకి నెడుతున్నాయి. ఈ పొత్తులు ఏ మేరకు సాగుతాయనే దానిపై రాజకీయ వర్గాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

మూడు జిల్లాల పరిధిలో రాజోలుతో పాటు అమలాపురం, ముమ్మిడివరం, కాకినాడ రూరల్, పిఠాపురం, జగ్గంపేట, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, పెద్దాపురం వంటి అసెంబ్లీ స్థానాలను జనసేన పార్టీ ముందు నుంచీ ఆశిస్తోంది. కానీ టిడిపికి కూడా వీటిలో అనేక స్థానాల్లో బలమైన నేతలు ఉన్నారు. ప్రధానంగా రాజమండ్రి రూరల్, పెద్దాపురం వంటి ప్రాంతాల్లో సిట్టింగ్ ఎంఎల్ఎలు ఉన్నారు. ఇప్పటికే సిట్టింగ్ ఎంఎలఎలకు ఆయా స్థానాలను కేటాయిస్తున్నట్టు టిడిపి అధినేత ప్రకటించారు. మెట్ట ప్రాంతంలో బలమైన నాయకుడు, టిడిపి సీనియర్ నేత జ్యోతుల నెహ్రూ ఉండగా జగ్గంపేట సీటుని జనసేనకు కేటాయించే అవకాశం లేదు. మాజీ ఎంఎల్ఎ ఎస్‌విఎస్ఎన్.వర్మ కచ్చితంగా పిఠాపురం నుంచే పోటీ చేస్తానని ఇప్పటికే స్పష్టం చేసారు. కానీ బలమైన కాపు సామాజికవర్గం ఉన్న నియోజకవర్గం కాబట్టి జనసేన ఈ టిక్కెట్ ఆశిస్తోంది. అందుకు తగ్గట్టుగానే పవన్‌కు అత్యంత సన్నిహితుడు అయిన తంగేళ్ళ ఉదయ శ్రీనివాస్‌ను ఆరు నెలల క్రితం ఇక్కడ ఇన్చార్జిగా నియమించారు. ఆయన వివిధ కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొంటున్నారు. ఒక వేళ పొత్తులో జనసేనకు కేటాయిస్తే స్వాతంత్ర్య అభ్యర్థిగా పోటీలో ఉంటానని వర్మ తన అనుచరులతో ఇప్పటికే మాట్లాడుకుని ముందుకు వెళుతున్నారు. పోటీపై కేడర్‌కు స్పష్టతనిచ్చారు రెండు రోజుల క్రితం పిఠాపురం మండలం చిత్రాడలో జరిగిన జయహో బిసి కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు పాల్గొని పొరుగు ఊరి వారిని తరిమికొట్టి స్థానికుడైన వర్మకు ఓటేయాలని పిలుపునిచ్చారు. దీంతో పిఠాపురం నియోజకవర్గంలో జనసేన, టిడిపి మధ్య పచ్చగడ్డి వేస్తే బగ్గు మనేలా రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఇలాంటి సీట్లు కొన్నింటిపై ఇరు పార్టీల మధ్య సఖ్యత కుదిరేలా కనిపించడం లేదు. ఒకరికొకరు సహకరించుకునే అవకాశం తక్కువని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ఉన్నతాధికారులకు ఉత్తమ పురస్కారాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, జెసి ఎన్.తేజ్‌భరత్, డిఆర్ఒ జి.నరసింహులు, ఆర్‌డిఒ ఎ.చైత్రవర్షిణి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.సరళవందనం, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ఎ ఒఎన్‌జిసి ఎం.వెంకటసుధాకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గేల్ ఇండియా ఎబివిఎస్‌బి.శ్రీనివాస్, ఎపిటి టూరిజం ఆర్‌డి వి.స్వామినాయుడు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కెఆర్ఆర్‌సి ఆర్.కృష్ణనాయక్, డిపిఒ జె.సత్యనారాయణ, డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసర్ ఎస్.మాధవరావు, డిస్ట్రిక్ట్ ఫిషరీస్ ఆఫీసర్ వి.కృష్ణారావు, డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ అండ్ ఎం పవర్ మెంట్ ఆఫీసర్ కెఎన్.జ్యోతి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి కె.విజయకుమారి, ఎస్ఇ ఇరిగేషన్ జి.శ్రీనివాసరావు, ఆర్ అండ్ బి జిల్లా ఇంజినీరింగ్ అధికారి ఎస్‌బివి.రెడ్డి, పిఆర్ ఇంజినీరింగ్ ఆఫీసర్ ఎబివి.ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ అండ్ ఎస్ జిల్లా ఇంజినీరింగ్ ఆఫీసర్ డి.బాలశంకర్రావు, జిల్లా హైసింగ్ హెడ్ జి.పరుశురాం, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ టివిఎస్ఎన్.మూర్తి, డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎం.శాంతకుమారి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.ప్రియాంక, డిఎల్ఎటిఒ డాక్టర్ ఎన్ వసుంధర, డిఇఒ ఎస్.అబ్రహం, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ కెఎస్ఎంవి.కృష్ణారావు, డిస్ట్రిక్ట్ సివిల్ సప్లయాస్ మేనేజర్ పి.విజయభాస్కర్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి.ఎం.ఎం.శేషగిరి, డిఎల్‌డిఒ పి.వీణాదేవి, డిఎల్‌డిఒ కొవ్వూరు వి.శాంతమణి, జైలు సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, జిల్లా ఫైర్ ఆఫీసర్ సిహెచ్ మార్టిన్ లూథర్ కింగ్, డిపిఆర్ఒ ఐ.కాశయ్య, లీడ్ బ్యాంక్ మేనేజర్ డివి.ప్రసాద్, డిస్ట్రిక్ట్ మెయిన్స్ అండ్ జువాలజీ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, డిస్ట్రిక్ట్ ఎకనామిక్స్ అండ్ స్టాటస్ ఆఫీసర్ సిపిఓ ఎల్.అప్పలకొండ, రుడా వైస్ చైర్మన్ బి.బాలస్వామి, ట్రెజరీఆఫీసర్ ఎన్.సత్యనారాయణ, జిల్లా ఎక్సైజ్ ఆఫీసర్ వై.శ్రీలత, డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ వై.ఉమామహేశ్వరరావు, డిస్ట్రిక్ట్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసర్ ఎం.జోస్లియా, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ కె.ఆనందరావు, అడిషనల్ డిఎంఇ సూపరింటెండెంట్ ఎం.లక్ష్మీసూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న రాజహేంద్రవరం మున్సిపల్ కమిషనర్ దినేష్‌కుమార్

డస్ట్ బిన్ల పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

ప్రతి ఇంటికీ రెండు డస్ట్ బిన్లను పంపిణీ చేశామని ఇఒపిఆర్‌డి శ్రవణ్ కుమార్ తెలిపారు మండలంలో మొత్తం 36వేల డస్ట్ బిన్లు వచ్చాయన్నారు. చాగల్లుకు 14వేలు, బ్రాహ్మణగూడెంకు 3,800, చంద్రవరానికి 1,600, చిక్కాలకు 4,600, దారవరానికి 1,600, గౌరుపల్లికి 900, కలవలపల్లికి 2వేలు, మల్లవరానికి 1,200, మార్కొండపాడుకు 1000, నందిగంపాడుకు 700, నేలటూరుకు 900, ఎస్.ముప్పవరానికి 900, ఊనగట్లకు 2,800 చొప్పున అందించామన్నారు

రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

పెరవలి మండలం కానూరు నుంచి ఉండ్రాజవరం వరకు రూ.4.20 కోట్లతో డిఎల్ కె రోడ్డు అభివృద్ధి పనులకు శుక్రవారం నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్‌నాయుడు ఉండ్రాజవరంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. కానూరు కొండాలమ్మ గుడి నుంచి సుమారు 8 కిలోమీటర్ల పొడవు ఉండే కానూరు-లంకలకోడేరు మీదుగా రహదారి పనులను తక్షణమే ప్రారంభించి, రెండు నెలలలో పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ తనయుడు వరుణ్‌సాయి, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి, సర్పంచ్ మెండే వెంకటరావు, వైస్ ఎంపిపి నరహర శెట్టి సరోజ, వైసిపి నాయకులు కఠారి సిద్ధార్థరాజు, సుధాకర్, ఎంపిటిసి సభ్యులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజానికి కృషి

ప్రజాశక్తి-నల్లజర్ల

క్షయ రహిత భారత్ కోసం అందరం సమిష్టి కషి చేసి క్షయ వ్యాధిని తరిమికొడదామని ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి జివివి.ప్రసాద్ పిలుపునిచ్చారు. నల్లజర్ల పిహెచ్‌సి ఆవరణలో గణతంత్ర దినోత్సవాన క్షయ బాధితులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. తగిన జాగ్రత్తలు పాటిస్తూ క్రమంగా మందులు వాడితే క్షయ నుంచి బయట పడొచ్చన్నారు. ప్రధానమంత్రి క్షయ రహిత భారత్ కోసం ప్రతి నెలా రోగికి పౌష్టికాహారం నిమిత్తం రూ.500 ప్రభుత్వం ఇస్తుందన్నారు. క్షయ నివారణకు మందు ఒక్క ప్రభుత్వ వైద్యశాలల్లో మాత్రమే లభిస్తుందన్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ వారి సహకారంతో అందజేసిన పోషకాహార కిట్లను క్షయ బాధితులకు అందించారు. ఈ కార్యక్రమంలో టిబి సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్ గాలంకి ఆశాజ్యోతి పాల్గొన్నారు.

ఆర్‌టిసి కండక్టర్ నిజాయతీ

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ఆర్‌టిసి డిపో కండక్టర్ శేఖర్ నిజాయతీని చాటుకున్నారు. గురువారం మండపేట సర్వీస్‌లో శేఖర్ విధులు నిర్వహిస్తున్నాడు. కొత్త తుంగపాడు చెందిన ముచ్చిక గన్నెమ్మ బంగారు వస్తువులు, కాళ్ల పట్టీలు బస్సులోనే మర్చిపోయింది. కండక్టర్ శేఖర్ వీటినిసేకరించి డిపో మేనేజర్ యు.రామన్న దొర, అసిస్టెంట్ మేనేజర్ అడ్డాల అప్పారావులకు అప్పగించారు. వస్తువల విలువ సుమారు రూ.60వేలు ఉంటుందని తెలిపారు. డిపో మేనేజర్ వస్తువుల గలవారిని డిపోకి పిలిపించి సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ మంగరాజు, ఎంప్లాయీస్ యూనియన్, నేషనల్ మజ్దూర్, యునైటెడ్ యూనియన్, కార్మిక పరిషత్ నాయకులు, వైస్సార్ యూనియన్ నాయకుల సమక్షంలో వస్తువులను అప్పగించారు. కండక్టర్ శేఖర్‌ను డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, డిపో సిబ్బంది అభినందిచారు.


నగలను అందజేస్తున్న కండక్ల శేఖర్ తదితరులు

పద్మవిభూషణ్ పట్ల మెగాస్టార్ అభిమానుల హర్షం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సినీనటుడు చిరంజీవికి పద్మ విభూషణ్ పురస్కారాన్ని ప్రకటించడం పట్ల మెగాస్టార్ అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ సెంటర్లో మెగాస్టార్ అభిమానులు కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.

అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

హోం మంత్రి తానేటి వనిత

ప్రజాశక్తి - గోపాలపురం

విభేదాలను పక్కనబెట్టి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేయాలని హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత వైసిపి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం గోపాలపురం కెఎస్.రెడ్డి ఫంక్షన్ హాల్లో నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వైసిపి మండల స్థాయి విస్తృత సమావేశం హోం మంత్రి అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రం వ్యాప్తంగా జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అందరూ కోరుకుంటున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో 175కి 175 స్థానాలు వైసిపి కైవసం చేసుకుంటుందని వనిత తెలిపారు. ఈ సమావేశంలో 2024 ఎన్నికల్లో వైసీపీ అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. సమావేశం అనంతరం భారీ గజమాలతో మంత్రిని సత్కరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వనిత

శాంతిభద్రతల రక్షణకు కృషి చేయాలి

ప్రజాశక్తి- కడియం

గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి నేరాలు అదుపునకు కృషి చేయాలని సిఐ బి.తులసీధర్ మహిళా పోలీసులకు సూచించారు. కడియం సిఐగా బాధ్యతలు చేపట్టిన ఆయన స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్ఐ.అశ్వాక్‌తో కలిసి శుక్రవారం మహిళాపోలీసులతో సమావేశమయ్యారు. గ్రామాల్లో శాంతి భద్రతలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణ కల్పించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలు పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాను అన్నివేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎవరికి ఏ కష్టం వచ్చినా సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తానన్నారు. మారుమూల ప్రాంతాల్లో జరిగే జూదాలపై నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యా సంస్థల సమీపాల్లో విద్యార్థుల పట్ల ర్యాగింగ్ చేసే వారిని ఉపేక్షించొద్దని, అలాంటి వారి వివరాలు సేకరించాలని కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న సిఐ తులసీధర్

బత్తులకు శుభాకాంక్షలు వెల్లువ

ప్రజాశక్తి - సీతానగరం

జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ రాష్ట్రంలో మొదటి సీటును రాజానగరం నియోజకవర్గానికి కేటాయించడంతో బత్తుల బలరామకృష్ణ అభిమానులు, జనసేన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. పలువురు జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. సీతానగరం, కోరుకొండ రాజానగరం మండలాల్లో బాణసంచా కాలుస్తూ, కేక్ కటింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు తదితరులు పాల్గొన్నారు.

150 మంది వైద్య పరీక్షలు

పెద్దాపురం: మండలంలోని పులిమేరులో అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శుక్రవారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆశ్రమ యోగ గురువు మసిముక్కల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 150 మందికి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ మిల్లెట్స్ టిఫిన్‌తో పాటు ఆయుర్వేద వంటకాల వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. తుమ్మల అచ్యుతరామయ్య, మల్లిక్, బుల్లయ్య, నాని, సుందర రెడ్డి రాజు, శేషారావు పాల్గొన్నారు.

యానాం వార్తలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎంఎల్ఎ అశోక్

ఘనంగా గణతంత్ర దినోత్సవం

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలోని శుక్రవారం ఉదయం గణతంత్ర దినోత్సవ వేడుకలు' ఘనంగా నిర్వహించారు. స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి పరిపాలనాధికారి మునిస్వామి పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పాల్గొన్నారు. అనంతరం పరిపాలనాధికారి మునిస్వామి, ఎంఎల్ఎ శ్రీనివాస్ అశోక్, ఎస్‌పి రఘునాయగం త్రివర్ణ రంగుల బెలూన్స్, శాంతికపోతాలను ఎగురవేశారు. యానాం పోలీసుశాఖ నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సిఐ షణ్ముగం పాల్గొన్నారు.

జిజిహెచ్‌ఒ సిబ్బంది చర్చలు సఫలం

ప్రజాశక్తి - యానాం

యానాం ప్రభుత్వాసుపత్రి వద్ద జనవరి మూడో తారీకు నుంచి శుక్రవారం వరకు సుమారు 23 రోజులపాటు ఔట్సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కారం కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు పరిష్కారం కోసం పుదుచ్చేరి ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు స్థానిక అధికారులతో చర్చలు జరిపారు. పరిపాలనాధికారి మునిస్వామి, వైద్య శాఖ అధికారి డిడి రవిశంకర్ పుదుచ్చేరి ఉన్నత స్థాయి అధికారులతో జరిపిన చర్చలు ఫలితంగా వచ్చే నెల 19వ తారీకు లోపు పెండింగ్‌లో ఉన్న 42 నెల జీతాలు ఇచ్చేందుకు, ఉద్యోగ భద్రత, పదోన్నతి తదితర సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు యానాం జిజిహెచ్ ఔట్సోర్సింగ్ సిబ్బంది తెలిపారు. పుదుచ్చేరి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన చర్చలతో నైనా తమకు వేతనాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. లేకుంటే మళ్లీ దీక్షకు దిగుతామని చెప్పారు. చర్చలు ఫలించడంతో శుక్రవారం మధ్యాహ్నం నుండి విధులకు హాజరవుతున్నామని తెలిపారు. 23 రోజులపాటు దీక్షలో సంఘీభావం తెలిపిన ప్రజా ప్రతినిధులకు, ఇతర పెద్దలకు, వివిధ పార్టీ ల నాయకులకు, కతజ్ఞతలు తెలిపారు.

రంజీట్రోఫీ క్రికెట్‌కు నాగూర్ బాబు ఎంపిక

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరిలో ఈ నెల 26 నుంచి జరగనున్న రంజీట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌కు యానాం సావిత్రినగర్‌కు చెందిన కాలాడి నాగూర్ బాబు ఎంపికైనట్టు రీజియన్ క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధి పి.సుమన్ బాబు తెలిపారు. ఈ రంజీట్రోఫీలో పుదుచ్చేరి జట్టు మధ్యప్రదేశ్ జట్టుతో ఆడనుందని తెలిపారు. పుదుచ్చేరి జట్టు లోకి నాగూర్ బాబు ఎంపిక కావడం పట్ల వై.జె.సత్యం, పి.రమేష్ నాయుడు, కె.సుబ్బారావు, జె.చిట్టి, కె.ప్రసాద్, కె.సత్యనారాయణ, పి.ప్రసాద్ హర్షం వ్యక్తం చేశారు.

త్వరలో ఒఎన్‌జిసి నష్టపరిహారం అందజేత

ప్రజాశక్తి - యానాం

యానాం మత్స్యకారులకు రావాల్సిన ఒఎన్‌జిసి వేట నష్ట పరిహారానికి సంబంధించిన నిధులు త్వరలో మత్స్యకారుల ఖాతాలో జమ అవుతాయని ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అందరి సహకారంతో ఈ సమస్య పరిష్కారమైందన్నారు. మత్స్యకారులు తమ ఖాతాలో పడిన డబ్బులను ఎవ్వరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వనవసరం లేదని తెలిపారు. ఎవరైనా మిమ్మల్ని డబ్బులు ఇవ్వమని అడిగితే పోలీసులకు గాని, తనకు గాని ఫిర్యాదు చేయాలని సూచించారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎంఎల్ఎ

జామియా మసీద్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - యానాం

స్థానిక మసీదు వీధిలో ఉన్న జామియా మసీద్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా ఎస్‌కె.జిలాని, వైస్ ప్రెసిడెంట్గా మహమ్మద్ కరీమ్, సెక్రటరీగా రిజ్వాన్, జాయింట్ సెక్రటరీగా మహమ్మద్ గౌస్ మొహిద్దీన్, ట్రెజరర్‌గా జిలానీ ఎన్నికయ్యారు. గత కార్యవర్గం కాలం పూర్తవడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి ముస్లిం పెద్దలు, పలువురు రాజకీయ నాయకులు అభినందనలు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శేరు నూకరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.